క్లుప్తంగా

డివైడర్‌ను బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, తిరుపతికి చెందిన శ్రీనివాసులు(36), భరత్(40) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా అంజిమేడు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి డివైడర్‌కు ఢీ కొన్నారు. గాయపడిన ఇద్దరిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న వైస్ ఎంపీపీ మల్లికమ్మ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని తొట్టంబేడు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 10మంది పారిశుధ్య కార్మికులకు వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ సొంత నిధులతో గురువారం దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి తరుణాక్షి రెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, కన్నలి భాస్కర్ రెడ్డి, బిల్ కలెక్టర్ రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అవన్నీ అవాస్తవాలే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం దేవదాయశాఖ మంత్రి రాక సందర్భంగా దుకాణాలు మూసివేశారంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలను ఆలయ ఈఓ సాగర్ బాబు ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ప్రచార రథం తిరుపతి జిల్లాలో నెలరోజుల పాటు ధర్మప్రచారంలో పాల్గొంటుందని, ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు ధర్మప్రచార మాసోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేశారని తెలిపారు. ఈ సందర్భంగా దుకాణదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసివేశారని పేర్కొన్నారు.

మొక్కలు నాటారు



మొక్క నాటుతున్న ఎస్‌బీఐ మేనేజర్

పిచ్చాటూరు: విరివిగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అంజాద్ అలీ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎంఈఓ-2 యుగంధర్ రాజుతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. వృక్ష సంపద తగ్గిపోతే మానవాళి భారీ మూల్యం చెల్లించక తప్పదని, దీని నుంచి గట్టెక్కాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరి ప్రకాష్, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, అములు, రుద్రమూర్తి, వెంకటేష్, నెయిల్, ఎస్‌బీఐ సిబ్బంది మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా నిర్మాణ పనులు

కార్వేటినగరం: జిల్లాకే తలమానికంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నిలుపుతున్నారు. నియోజకవర్గంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం మోల్డింగ్ పనులను ప్రారంభించారు. జీడీనెల్లూరు నియోజకవర్గానికి రాష్ట్రంలో గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులకు మంత్రి నారాయణస్వామి శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి చేసి చూపుతున్నారు. కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో సామాజిక ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి రూ.26 కోట్లు వెచ్చించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుంది. సీహెచ్‌సీ నిర్మాణ పనులు జరుగుతుండగానే, అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించడానికి డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు.

కామధేనువుపై శ్రీకృష్ణుడు

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా వెళ్లారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని భక్తిప్రపత్తులతో పూజించి, సారెను సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం యాదవ సంఘ ఆధ్వర్యంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, మోహన్ పర్యవేక్షించారు.

సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, హాజరైన మండల కన్వీనర్లు, గృహసారథులు





సమన్వయంతో విజయం సాధిద్దాం

- వచ్చే ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం
- జగనన్న పాలనలోనే అభివృద్ధి
- కన్వీనర్ల సమీక్షలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సంక్షేమ పథకాల ప్రచారంలో జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు, గృహసారథులు, మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు కలసి రాబోవు ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అఖండ మెజారిటీ తేవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం సత్యవేడు భేరిశెట్టి కళ్యాణ మండపంలో నియోజవర్గ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాలతో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ శ్రేణులు ఎంతగానో కృషి చేశారని, ఇదే స్ఫూర్తి రానున్న ఎన్నికల్లో కొనసాగించి, వచ్చే ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్‌సీపీ జెండాను తిరిగి ఎగురవేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా సీఎం చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. పేదవానికి న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరలా రావాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 5వ రాష్ట్రంగా ఎదిగిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్లు కే.సుశీల్ కుమార్ రెడ్డి, గవర్లకృష్ణయ్య, విద్యానాథరెడ్డి, దయాకర్ రెడ్డి, అపరంజిరాజు, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, చిన్నా, వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్ రెడ్డి, శాస్త్రిరాజు, పార్టీ నాయకులు దివాకర్ రెడ్డి, హరిబాబు రెడ్డి, మహేష్‌రెడ్డి, నందకుమార్, ఏడు మండలాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు శ్రీసిటీ సాయం



సత్యవేడు: మండలంలోని రాచపాళెంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన వేలు కుటుంబానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి చెక్కు రూపేణా ఇచ్చిన రూ. 25 వేలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. పేదలను ఆదుకోవాలని కోరిన వెంటనే శ్రీసిటీ ఎండీ చొరవ చూపారని ఎమ్మెల్యే శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ లు రూబెన్, గోవిందస్వామి, ఎంపీటీసీ రమణయ్య, మెయ్యప్పన్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయస్థాన భవనంలో సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తెలిపారు. న్యాయమూర్తి గురువారం మాట్లాడుతూ పట్టణంలోని కోర్టు సముదాయంలో సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వివరించారు. దీనిని అన్నిశాఖల అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజీయే రాజమార్గమని ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

ఎస్‌ఐ తిమ్మయ్యకు పదోన్నతి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న తిమ్మయ్య సీఐగా పదోన్నతి పొందారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలకు పదోన్నతి కల్పిస్తూ పోలీసు ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. అందులోభాగంగా ఎస్‌ఐ తిమ్మయ్య సీఐగా పదోన్నతి లభించింది.

ముగ్గురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి



హనుమంతప్ప, ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ముగ్గురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్ప, శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్, బుచ్చినాయుడుకండ్రిగ ఎస్‌ఐ మంజునాథరెడ్డిలకు సీఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. వారిని పలువురు అభినందించారు.

పిల్లల చదువుపై శ్రద్ధ వహించండి



ఎన్‌టి కండ్రిగ పాఠశాలలో డెస్కులను పరిశీలిస్తున్న ఎంఈఓ-1 రవి

సత్యవేడు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలనిని ఎంఈఓ-1 కే.రవి అన్నారు. గురువారం మండలంలో ఎన్‌టి కండ్రిగ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని తయారు చేసి వడ్డించాలన్నారు. అంతకు ముందు తిరుపతి జెనిత్ మెటా ప్లాట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సరఫరా చేసిన టైప్6, టైప్-9 డెస్కులను ఎంఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశం, ఉపాధ్యాయులు ఎం.మునికృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



దుస్తులను అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు రామానుజ దాసన్

వరదయ్యపాళెం: స్థానిక హైస్కూల్‌లోని ఇంటర్ విద్యార్థులకు తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఎలవూరుకు చెందిన రామానుజన్ చారిటబుల్ ట్రస్ట్ యూనిఫాం దుస్తులను వితరణ చేసింది. గురువారం 40మంది ఎంపీసీ, బైపీసీ గ్రూపుల ఫస్టియర్ విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు రామానుజ దాసన్ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రుద్రయ్య, ఉపాధ్యాయులు వాణి, గోకులకృష్ణ, త్రిమూర్తి, మోహనాచారి, శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న వరి పంట పరిశీలన



నీట మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కనమనంబేడులో దెబ్బతిన్న వరిపంటను గురువారం వ్యవసాయాధికారిణి భారతి పరిశీలించారు. సుమారు 50 ఎకరాల్లో కోతకొచ్చిన వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిందని, చేతికి వచ్చే సమయంలో వర్షానికి తీవ్రంగా నష్టపోయామని రైతులు మొలకెత్తిన ధాన్యాన్ని ఆమెకు చూపారు. తమ గోడు నివేదించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ, మూడు రోజులుగా కురిసిన వర్షాల వలన వరిపంట దెబ్బతినడంతో మొమ్ములు వస్తున్నాయన్నారు. పొలాలలో నీరు నిల్వ ఉండకుండా గట్లు తెగ్గొట్టాలని సూచించారు. పంట నష్టంపై జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతానన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే ..



మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని, పార్టీలు మారే సంస్కృతి తనకు లేదని మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గాజులమండ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయన ఇంటికెళ్లి పలకరించి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. దీంతో ఆయన ఎప్పటికీ తాను వైఎస్సార్ సీపీలోనే ఉంటారని, 2024లోనూ సమష్టిగా కృషి చేసి మరోమారు ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డిని మరింత భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.మల్లవరం సర్పంచ్ ఆవుల మునివెంకట్రామిరెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, రేణిగుంట మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యువల్

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీస్వామి విద్యాప్రకాశనంద డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు రెన్యూవల్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీలత తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022-23లో పనిచేసిన వారు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి రెన్యువల్ కోసం ఈ నెల 19వ తేదీ శనివారం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో అప్లికేషన్, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా జతపరిచి అందజేయాలన్నారు.

ఎన్జీవో సభలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

శ్రీకాళహస్తి: విజయవాడలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆ సంఘం నాయకులు గురువారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన్నుఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం శ్రీకాళహస్తి తాలుకా నాయకులు సి.చెంచురత్నంయాదవ్, నాగరాజు, నారాయణరెడ్డి, జనార్దన్, చిరంజీవి, భాస్కర్, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రేణిగుంట: మండల కేంద్రంలోని సంతగేటు సమీపంలో గురువారం రాత్రి రైలు కింద పడి యువకుడు మృతి చెందినట్లు రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ రవి తెలిపారు. సుమారు 25 సంవత్సరాల యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో, సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుని ఆచూకీ తెలిస్తే రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

శ్మశానవాటికపై 'అటవీ' ఆంక్షలు..



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఎంజీనగర్ గిరిజనులు

- మండిపడుతున్న ఎంజీనగర్‌వాసులు
- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన గిరిజనులు

వరదయ్యపాళెం: మండలంలోని ఎంజీనగర్ గిరిజన కాలనీ వాసులు ఐదు దశాబ్దాలకు పైగా గ్రామ సమీపంలోని ఖాళీ స్థలాన్ని శ్మశానవాటికగా వినియోగిస్తున్నారు. అయితే తాజాగా అటవీశాఖ అధికారులు ఆ స్థలం అటవీశాఖకు చెందినదని, ఇకపై అక్కడ దహన సంస్కారాలు చేసేందుకు వీలు లేదని ఆంక్షలు విధిస్తుండడంతో ఆగ్రహించిన ఎంజీనగర్ గిరిజనకాలనీ వాసులు గురువారం ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజుకు, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శాంతికి వినతిపత్రం ఇచ్చి, సమస్యను నివేదించారు. దీనిపై వారు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాము ఎంతో కాలంగా ఉపయోగించుకున్న శ్మశాన స్థలంపై అటవీ అధికారులు తీరు మార్చుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మంచం గుర్తుకు ఓటేసి గెలిపించండి

- సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం





అడవి కొడియంబేడులో పార్టీ శ్రేణులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, గోవర్ధనగిరిలో ప్రచారం చేస్తున్న బాలసుబ్రమణ్యం రాజు

పిచ్చాటూరు: మంచం గుర్తుకు ఓట్లేసి అడవి కొడియంబేడు సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సర్పంచ్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. తన తల్లి పుష్పవతి మరణించడంతో ఆ స్థానంలో పోటీ చేస్తున్నానని, తనకు ఓట్లేసి గెలిపించాలని కిరణ్ ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, నాయకులు చలపతిరాజు, మోహన్, చెంగల్రాయ రెడ్డి, ప్రకాష్ నాయుడు, సుబ్రమణ్యం, ఆర్ముగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌను గుర్తుకు ఓటేసి గెలిపించండి

గౌను గుర్తుకు ఓటేసి గోవర్ధనగిరి 7వ వార్డు సభ్యునిగా తనను గెలిపించాలని వైఎస్‌ఆర్‌సీపీ సానుభూతి అభ్యర్థి బాలసుబ్రమణ్యం రాజు కోరారు. గురువారం తన వార్డు పరిధిలోని ఓబుల్‌రాజు కండ్రిగ ఏఏడబ్ల్యూ, నారాయణరాజు కండ్రిగ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయన కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- గ్రామ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- 'గడప గడపకు' లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- గాజులమండ్యంలో నూతన భవనాలు ప్రారంభం

రేణిగుంట: రాష్ట్రంలో భారీ ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఆయన రేణిగుంట మండలం గాజులమండ్యం, రజక కాలనీ, నీలిసానిపేటలలో పర్యటించారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నూతన భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గంగారి రమేష్ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న సాకారం చేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శనీయమన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీవో జ్యోతిశ్రీ ఆధ్వర్యంలో 'నా భూమి-నా దేశం' కార్యక్రమం ద్వారా అమరవీరులకు నివాళులర్పిస్తూ మట్టి ప్రమిదలను వెలిగించారు. ఎమ్మెల్యేతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గడప గడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయన్ను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో సుభిక్షంగా ఉన్నట్లు తెలిపారు. స్థానికులందరూ మాట్లాడుతూ, సంక్షేమ ప్రదాత జగనన్నకు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలిచి మరోసారి గెలిపించుకుంటామని ఎమ్మెల్యేకు మాటిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి అందకుంటే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి 'ప్రజాదర్బారు' కార్యక్రమం ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీలు వెంకటరమణారెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, వేదకృష్ణ, సుబ్బారెడ్డి, మోహనరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, యోగేశ్వరరెడ్డి, ఆవుల మునివెంకట్రామిరెడ్డి, యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల కంటే కషాయాలే మేలు

పాలసముద్రం: వ్యవసాయంలో రసాయనాల కంటే కషాయాలు ఎంతోమేలని ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఎదుట ద్రవజీవామృతం తయారు చేశారు. డీపీఎం వాసు మాట్లాడుతూ ద్రవజీవామృతం తయారు చేసేందుకు 2 కిలోల శనగపిండి, 2 కిలోల బెల్లం, 10 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల గోపంచితం, 20 లీటర్ల నీరు డ్రమ్ములో వేసి కలియబెట్టాలని తెలిపారు. ఈ విధంగా తయారు చేసిన కషాయాన్ని వరి, కూరగాయల పంటలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం అవలంభించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.